94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




త్వరలో మీముందుకు రానున్న
'ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల కాంటాక్ట్ బుక్‌లెట్'
రాజధాని వార్తలు ప్రత్యేక సంచిక ఫోన్ : 9440662699


# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU


కేవలం 1000 రూపాయలకే



విజయవాడ బందర్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో ఏసి మీటింగ్ హాలు ఏర్పాటు చేయడం జరిగింది. కేవలం 1000 రూపాయలకే ఇందులో 60 మందితో సమావేశాలు జరుపుకోవచ్చును.
ఫోన్: 94406 62699



అమరావతి సంపుటి : 4 సంచిక : 49, పేజీలు 4, వెల: రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | సోమవారం 9 - ఆదివారం 15 సెప్టెంబర్, 2019
Amaravati Volume : 4 Issue : 49, Pages 4, Rate : 2.00 | ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY | Monday 9- Sunday 15 September, 2019



వివరాలు2లో...



తాత్కాలిక రాజధాని చేశారు: బొత్స

వివరాలు3లో...



70శాతం లబ్దిదారులకు బియ్యం పంపిణీ: నాని

వివరాలు3లో...



కవల్లలకు జన్మనిచ్చిన 73 ఏళ్ల బామ్మ

వివరాలు4లో...



లక్ష ఉద్యోగాలు ఉఫ్...


## సీఎంతో సీబిఐ డైరెక్టర్ జనరల్



**రాజధాని వార్తలు, తాడేపల్లి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సీబిఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ శనివారం సమావేశం అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ జరిగింది. అనంతరం చంద్రజిత్ బెనర్జీ మాట్లాడుతూ.. త్వరలోనే ముఖ్యమంత్రి తో మరోసారి సమావేశం కానున్నట్లు తెలిపారు.

## ఆ కేసులపై పునర్విచారణ చేయిస్తాం : మంత్రి సుచరిత



**రాజధాని వార్తలు, గుంటూరు :** గత ఐదేళ్లలో టీడీపీ నేతలు రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు సృష్టించారని, అక్రమ కేసులు పెట్టి ఎంతోమందిని వేధించారని హెూంశాఖమంత్రి మేకతోటి సుచరిత ఆరోపించారు. అక్రమ కేసు బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శనివారం ఆమె పల్నాడులోని పిడుగురాళ్ల వాసవీ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చంద్రబాబు ప్రభుత్వ బాధితుల సమావేశా'నికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ... గత టీడీపీ పాలనలో ఎన్నో అరాచకాలు జరిగాయన్నారు. దేశంలో ఎక్కడ లేని అరాచకాలు, దారుణాలు పల్నాడులో జరిగాయన్నారు. అధికారం పోయాక వారి అరాచకాలు ఒక్కొక్కటి భయటకు వస్తుండడంతో ఎదురుదాడి ప్రారంభించారని ఆరోపించారు. పెయిడ్ ఆర్టీస్టులతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ధర్నాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలన రాక్షస పాలనకు నిదర్శమన్నారు. యరపతినేతి, కోడెల అక్రమాలను చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. అక్రమ కేసు బాధితులకు అండగా ఉంటామని, ఆ కేసులపై పనర్విచారణ చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ బాధితలందరికి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# తాత్కాలిక రాజధాని చేశారు : బొత్స



**రాజధాని వార్తలు, తాడేపల్లి :** తుగ్లక్ పాలన అంటే చంద్రబాబు నాయుడిదే అనే విషయం లోకేశ్ తెలుసుకోవాలని పురపాలక శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. తుగ్లక్ అంటే ఎవరో అసలు లోకేశ్‌కు తెలుసా అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నుంచి మూటా–ముల్లె సర్దుకుని చంద్రబాబు పారిపోయివచ్చిన విషయం లోకేశ్ మర్చిపోయాడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంద రోజుల పాలనపై విమర్శలు గుప్పిస్తున్న లోకేశ్ తీరును బొత్స ఎండగట్టారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...వందరోజుల్లో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం జగన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. పెట్టిన తొలి సంతకాలకు చట్ట రూపం తెచ్చిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. నాడు చంద్రబాబు పెట్టిన మొదటి సంతకాలకు విలువలేకుండా పోయిందని.. ప్రతిపక్షంలో ఉండటాన్ని తట్టుకోలేకే ఆయన.. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కిడ్నీ బాధితుల కోసం 200 పడకల ఆస్పత్రిని సీఎం జగన్ ప్రారంభించిన విషయం.. లోకేశ్, చంద్రబాబుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

**సమాధానం చెప్పండి బాబూ..!**

'చంద్రబాబు పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఇప్పుడు శాంతియుత పాలన సాగుతుంటే పెయిడ్ ఆర్టిస్టులతో పునరావాస కేంద్రాలను పెడుతున్నారు. చంద్రబాబు జిమ్మిక్కులను ప్రజలు నమ్మరు. ముందు కోడెల టాక్స్ వసూళ్లు చేశాడా లేదా.. చింతమనేని దళితులను కులం పేరుతో దూషించారా లేదా.. కూన రవి కుమార్ ఉద్యోగులను తిట్టారా లేదా...**దళిత ఎమ్మెల్యే శ్రీదేవిని టీడీపీ నేతలు దూషించారా లేదా.. సోమిరెడ్డి తప్పుడు పత్రాలతో భూములు కాజేశారా లేదా వీటన్నింటికి సమాధానం చంద్రబాబు చెప్పాలి'** అని బొత్స డిమాండ్ చేశారు. ఓడిపోయినా చంద్రబాబులో మార్పు రాలేదని. వరదలు వస్తే చంద్రబాబు బురద రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నాకు నటించడం రాదు..**

అమరావతి విషయంలో టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై స్పందించిన బొత్స...**'అమరావతి రాజధాని అని చెప్పి చంద్రబాబు ప్రభుత్వం ఎక్కడైనా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందా.** నాకు ఉన్న సమాచారం ప్రకారం అలా జరుగలేదు. ఏదైనా ఒక చట్టం చేశారంటే దానికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి. అమరావతిలో తాత్కాలికంగా భవనాలు కట్టినట్లే అమరావతిని తాత్కాలిక రాజధానిగా చంద్రబాబు పెట్టారు. అమరావతికి ఒక అడ్రస్ లేకుండా చంద్రబాబు చేశారు. అమరావతిపై చంద్రబాబు సమాధానం చెప్పాలి' అని ప్రశ్నలు సంధించారు. అదే విధంగా.. **'పవన్ కల్యాణ్ గతంలో రాజధానికి ఐదు వేల ఎకరాలు సరిపోతాయని చెప్పారు.** ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని గతంలో పవన్ చెప్పారా లేదా. ఇప్పుడు మంత్రులు ఎలా ఉండాలో, ఎలా పనిచేయాలో పవన్ చెప్పనక్కరలేదు. మీలాగా నాకు నటించడం రాదు' అని పవన్ కల్యాణ్ తీరును దుయ్యబట్టారు.



**చంద్రయాన్-2 మిషన్ 95 శాతం విజయ వంతమైంది. దురదృష్టవశాత్తు కొద్దిక్షణాల్లో చంద్రునిపై ల్యాండ్ అవ్వటానికి ముందు ల్యాండర్‌తో కమ్యూనికేషన్ కట్ అయింది.**

**- ప్రొ.వీసీ డాక్టర్ నారాయణరావు**
**ఎస్ఆర్ఎం యూనివర్శిటీ, అమరావతి**

## చంద్రబాబు డ్రామాలు - పుష్ప శ్రీవాణి

### డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి విమర్శలు



**రాజధాని వార్తలు, అమరావతి :** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత బాబుకు లేదని అన్నారు. వందేళ్లైనా జరగవు అనుకున్న పనులను సీఎం జగన్ వంద రోజుల్లోనే చేసి చూపించారని కొనియాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేపట్టని సంస్కరణలు సీఎం జగన్ వంద రోజుల్లోనే చేశారని పేర్కొన్నారు. 'అధికారంలోకొచ్చిన వంద రోజుల్లోనే లక్షా 33 వేల ఉద్యోగాలిచ్చారు. దేశంలో ఏ సీఎం కూడా ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. అది సీఎం జగన్ చిత్తశుద్ధి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు, పనుల్లో 50 శాతం వాటా ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది. కల్లోనైనా చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల కోసం ఆలోచించారా' అని అన్నారు.

పునరావాస కేంద్రాల పేరుతో చంద్రబాబు డ్రామాలాడుతున్నారని పుష్ప శ్రీవాణి విమర్శించారు. నారాయణ కాలేజీల్లో 25 మంది ఆడపిల్లలు చనిపోయినప్పుడు, ఎమ్మార్వో వనజాక్షిని చింతమనేని ప్రభాకర్

- మిగతా 2 లో

## రాజధాని వార్తలు - సోషల్ మీడియా



'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి కేవలం సీఎం పనిచేయడమే సరిపోదు. పార్టీలోని నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పనిచేయాలి. అందరిదీ ఒకే నినాదం కావాలి. లేకపోతే 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఓటు బ్యాకుగానే చూస్తున్నారనే అనుమానం వస్తుంది. టీడీపీ నాయకత్వం, కార్యకర్తలు చేసిన తప్పులు మనం చేయకూడదు. ఇటీవల డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్యేకు జరిగిన సంఘటన రాజకీయ సమస్య కాదు, మానవ హక్కుల సమస్య, వివక్ష!! ఆమె ఒక్కతే కాకుండా మనందరం కూడా కలిసి పనిచేయాలి. ఆమెకు మద్దతు తెలపాలి.

– దీపికా కడారి

**వాస్తవం**



"ఇప్పుడే కశ్మీర్ నుంచి వచ్చా, అక్కడి పరిస్థితులు అందరూ ఊహి స్తున్న దానికంటే తీవ్రంగానే ఉన్నాయి. సాయుధ బలగాలు అర్ధరాత్రి ఇళ్లపై దాడులు చేసి పన్నెండేళ్ల వాళ్లని చితకబాదుతున్నారు. అత్యాచారం చేస్తామంటూ మహిళలను బెదిరిస్తున్నారు. యువకులకు విద్యుత్ షాక్ ఇస్తున్నారు. వాళ్లు ఎక్కడ ఉన్నారో కుటుంబ సభ్యులకు కూడా తెలియదు. మీ అందరూ అనుకుం టున్న సాధారణ పరిస్థితి ఇలా ఉంది. ఇలాంటి పరిస్థితి కశ్మీర్‌లో నేనెప్పుడూ చూడలేదు. కశ్మీర్‌లో భారత మీడియా పట్ల గతంలో ఎన్నడూ లేనంత ద్వేషం నెలకొని ఉంది"

- రాణా అయూబ్, జర్నలిస్ట్

## అమరావతికి గెజిట్ నోటిఫికేషన్ ఎందుకివ్వలేదో ? : బొత్స



**రాజధాని వార్తలు, అమరావతి :** ఐదేళ్లలో చంద్రబాబు చేయలేని పనులను, సీఎం జగన్ వంద రోజుల్లో చేసి చూపించారని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. నాయకుడు ఎలా ఉండాలో జగన్ చూపిస్తున్నారని తెలిపారు. ఇతర నిర్మాణాల మాదిరే అమరావతిని తాత్కాలికంగా ఉంచారని, ఏపీ రాజధాని అమరావతి అని చంద్రబాబు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. రాజధానికి ఒక అడ్రస్ అంటూ లేకుండా

- మిగతా 2 లో



ఉపాధ్యాయ దినోత్సవ రోజున స్కోచ్ అవార్డ్ గవర్నెన్స్ గోల్డ్‌ను ముఖ్యమంత్రి నుండి స్వీకరిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ ఎ.యండి. ఇంతియాజ్


# 'విక్రమ్'తో కమ్యూనికేషన్ కట్

### డేటా విశ్లేషిస్తున్నాం : ఇస్రో

**రాజధాని వార్తలు, బెంగళూరు :** చంద్రయాన్–2 ల్యాండర్ విక్రమ్‌తో కమ్యూనికేషన్ తెగిపోయిందని ఇస్రో ప్రకటించింది. చంద్రుడి ఉపరితలానికి 2.1 కిలోమీటర్ల దూరం వరకు సవ్యంగా ప్రయాణించిన ల్యాండర్‌తో ఆ తరువాత సంబంధాలు తెగిపోయాయని ఇస్రో చైర్మన్ కె.శివన్ ప్రకటించారు. దీనికి కారణాలను విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

### ఇస్రో చైర్మన్ శివన్ కన్నీటి పర్యంతం





భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ కె.శివన్ ప్రధానమంత్రి మోదీ ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆయనను మోదీ హత్తుకుని ఓదార్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం ఉదయం బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో శాస్త్రవేత్తల నుద్దేశించి ప్రసంగించారు. చంద్రయాన్–2 మిషన్ చివరి క్షణంలో విఫలమైనప్పటికీ ఉదాసీనం చెందవద్దని ధైర్యవచనాలు పలికారు. మళ్లీ అద్భుత విజయాలు సాధిస్తామని ఉత్సాహం నింపేందుకు ప్రయత్నించారు. అయితే.. మోదీ ప్రసంగం ముగిసిన తర్వాత ఇస్రో చీఫ్ కె.శివన్ ఉద్వేగంతో కన్నీళ్లుపెట్టుకున్నారు. ఆయనను మోడీ కౌగలించుకుని తల మీద చేతితో తడుతూ ఓదార్చారు. కొంతసేపటికి శివన్ స్థిమితపడ్డారు. ఆయనతో మోదీ మళ్లీ హితవచనాలు పలికారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–2 మిషన్‌లో విక్రమ్ మాడ్యూల్‌ను చంద్రుడి మీద దింపటానికి ఇస్రో చేపట్టిన ప్రయోగం అనుకున్న విధంగా సఫలం కాకపోవటంతో ఇస్రో శాస్త్రవేత్తలు కొంత నిస్పృహ చెందారు.



- మిగతా 2 లో




టీచర్స్ డే జరుపుకున్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీ, అమరావతి. కేక్ కట్ చేస్తున్న వీసీ, ప్రొవీసీలు డాక్టర్ జంషెడ్ భరూచా, డాక్టర్ నారాయణ రావులు

రాజధాని వార్తలు కలం

# అమరావతి ఒక ఆశ!

నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడి అప్పుడే 5 సంవత్సరాలు గడిచాయి. రాజధాని లేని రాష్ట్రంగా ఏర్పడి, లోటు భడ్జెట్‌తో రాష్ట్రప్రభుత్వ పాలన మొదలైంది. 10 సంవత్సరాలు హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా వాడుకుంటానికి అవకాశమున్నప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లాలోని అమరావతిని రాజధానిగా ప్రకటించారు. రైతుల నుండి భూములను ల్యాండు పూలింగ్ పద్ధతిలో తీసుకున్నారు. 33 వేల ఎకరాలు తీసుకున్నప్పటికీ ఇంకా భూములు తీసుకోవాలన్నా కాంక్షతోనే రాజధాని ప్రాంతాన్ని నిర్ణయించలేదు. ఇప్పటికి దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రాకు రాజధాని నగరం లేదనే చెప్పుకోవాలి.

మనకు కూడా ఒక మెగా సిటీ కావాలని ప్రజలు కొరుకుంటున్నారు. ఎంతోకష్టాలతో అభివృద్ధి చేసుకుని హైదరాబాద్‌ను కోల్పోవటంతో ఆంధ్రాకు కూడా ఒక మెగా నగరం ఉండాలని ప్రతి ఆంధ్రుడు కోరుకున్నాడు. ఏదేమైనా అమరావతిని ఎంచుకోవటం జరిగింది. రైతులు, ప్రజలు, ఇక్కడ ఒక మహానగరం నిర్మాణం జరుగనుందని గత పాలకులు నమ్మించారు. ప్రజలు నమ్మారు. అయితే జరగకుడని పొరపాటు టీడీపీ ప్రభుత్వం చేసింది. మూడు సంవత్సరాలలో అభివృద్ధిచేసి రైతులకు ప్లాట్లను, ఇస్తామన్నారు. అది జరగలేదు. కొంతమేరకు రోడ్లు, ప్రభుత్వ భవనాలు (తాత్కాలికంగా) నిర్మించారు. వాణిజ్య పరంగా కొన్ని సంస్థలకు భూములను కేటాయించారు. అవేమి రాలేదు. కొన్ని విద్యా సంస్థలు మాత్రమే వచ్చి వారి కాలేజీలను నడుపుతున్నారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావటం అటు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మరో మారు గెలవటం జరిగింది. ఇటు ఆంధ్రాలో వై.ఎస్.ఆర్.పార్టీ 151 సీట్లు గెలిచి జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రాజధాని అమరావతి విషయంలో ఇప్పటివరకు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడలేదు. రాజధాని మార్చవద్దని ప్రతిపక్షలు కొరుకుంటున్నారు. మార్చవద్దని మెజార్టీ భూములున్న రైతులు వ్యాపారస్తులు చెబుతున్నారు. రాజధాని ప్రాంతంలో ఉంటున్న రైతులకు రాజధాని ఇక్కడ ఉంటుందా లేక మార్చబోతున్నారో తెలియదు. ఒక క్లారిటీలేదు. అయితే గత వారంలో రైతులకు రావల్సిన కౌలును ప్రభుత్వం చెల్లించటంతో ఒకింత ఊరట లభించింది. అంటే రాజధాని అమరావతిలోనే ఉంటుందనే ఆశ. ఒకవేళ ఇక్కడే ఉన్నట్లయితే ఈ ప్రాంతమంతటినీ అభివృద్ధి చేస్తారా? లేక కేవలం 5 వేల ఎకరాలలోనే రాజధానిని కావలసిన మేరకు సదుపాయాలను తీసుకుని మిగిలిన స్థలాలను రైతులకిచ్చేస్తారా? వీటిపై స్పష్టత ఇవ్వలేదు. రాజధాని ప్రాంతాన్ని తరలించినా లేక ఒక చిన్న ప్రాంతాన్ని అభివృద్ధి పరచినా నష్టపోయేది రైతులే. ఎందుకంటే తమకిచ్చిన ప్లాట్లను వాడుకునే పరిస్థితి లేదు. వ్యవసాయం చేయలేరు. కాబట్టి ఒక పక్కా ప్రణాళికలో ప్రభుత్వం రాజధాని అమరావతి గురించి ప్రజలకు, స్థానికులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రభుత్వాలు మారినా, స్థానిక రైతులు, ప్రజలు, వ్యాపారస్తులు లబ్ధి పొందాలి. కానీ, నష్టపోకూడదు. ఆ దిశలో వై.యస్.ఆర్.పార్టీ ప్రభుత్వం కొంచెం ఆలస్యమైనా రాజధాని ప్రాంతవాసులందరికీ లబ్ధిచేకూరుస్తారని ఆశిద్ధాం. ఆదిశగా ప్రభుత్వం సమర్ధిదాం.

చంద్రబాబు డ్రామాలా – పుష్ప శ్రీవాణి

(మొదటిపేజీ తరువాయి)

కొట్టినప్పుడు ఎందుకు పునరావాస కేంద్రాలు పెట్టలేదని ప్రశ్నించారు. తన పార్టీ ఎమ్మెల్యేలు, నేతల్ని కాపాడుకోవడానికే బాబు పునరావాస కేంద్రాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 100 రోజుల పాలనకే చంద్రబాబుకు మతి భ్రమించిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ఏం విమర్శించాలో తెలియక డ్రామా ఆర్టిస్టులతో దుష్ప్రచారానికి తెగబడ్డారని, ఇప్పటికయినా అబద్దాలు మాని చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని ఆమె హితవు పలికారు.




బ్యాంక్ఆఫ్ ఇండియా 114వ ఫౌండేషన్ డే సందర్భంగా మంగళగిరి బ్రాంచ్ మెడికల్ క్యాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కృష్ణకిశోర్, డాక్టర్‌ల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ అనుమ్ ప్రసాద్ పాల్గొన్నారు.



బ్యాంక్ఆఫ్ ఇండియా 114వ ఫౌండేషన్ డే సందర్భంగా ఆత్మకూరులో బ్రాంచ్‌లో ఉత్తమ విద్యార్ధులకు నగదు బహుమానాల ను పంపిణీ చేశారు.

## నా తరగతి గది

అన్నదానం మహాదానమే కానీ
అన్నం అర్ద జాముగరకె అరిగిపోవును
వస్త్ర దానం మహాదానమే కానీ
వస్త్రం కొన్నాళ్లలో చిరిగిపోవును
గృహ దానమొకటి భవ్య దానమే కానీ
కొంప కొన్నేళ్లలో కూలిపోవును
భూదానమొకటి పుణ్యదానమే కానీ
భూమి అన్యుల పాలుజేరు
కూలిపోక
కాలిపోక
కరిగిపోక
అరిగిపోక
ఇంచియేని చిరిగిపోక
నిత్యమై
నిఖిలమై
లినిర్మలమై నిలిచి యుండు విద్యాదానమొక్కటే జగతినన్.
అజ్ఞానాన్ని ఖననం చేసే స్మశానం .......
నా తరగతి గది
జ్ఞానానికి జన్మనిచ్చే ప్రసూతికేంద్రం......
నా తరగతి గది
జాతి భవిత ను నిర్మించే కర్మాగారం ......
నా తరగతి గది
మంచిని పెంచి చెడును తుంచే న్యాయస్థానం.......
నా తరగతి గది
ఎత్తుకుపోలేని సంపదనిచ్చే తరగని నిధి .....
నా తరగతి గది
తరగని గతిని, సద్గతిని నాకు ప్రసాదించిన ఉపాధ్యాయులు అందరికి శుభాకాంక్షలు.
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

## అమరావతికి గెజిట్ నోటిఫికేషన్ ఎందుకివ్వలేదో చెప్పాలి : బొత్స

(మొదటిపేజీ తరువాయి)

చేశారని, గెజిట్ నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదో చంద్రబాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమా ప్రపంచం నుంచి బయటికి వచ్చి మాట్లాడాలని సూచించారు. అమరావతిలో రాజధాని వద్దని గతంలో పవన్ అన్నారని, మళ్లీ ఇప్పుడేమో అక్కడే ఉండాలని అంటున్నారని బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.





వైయస్సార్ వర్ధంతి రోజున చిగురు ఆశ్రమంలోని విద్యార్ధులకు స్కూల్స్ బ్యాగులు ఇస్తున్న ఎమ్మెల్యే ఆర్కే. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ బెఏరియా కాలిఫోర్నియా కార్యకర్తలు స్పాన్సర్‌గా ఆర్ధిక సహాయం అందించారు.

## 'జగన్ ప్రజాసంక్షేమ పాలన కొనసాగిస్తున్నారు'



**రాజధాని వార్తలు, విశాఖపట్నం :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రా యునివర్సిటీలో విద్యార్థి విబాగం ఆధ్వర్యంలో విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు బి. కాంతారావు ఆధ్వర్యంలో జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సంవత్సరం పాఠశాలలో డ్రాపవుట్స్ తగ్గడానికి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అమ్మ ఒడి పథకం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. వంద రోజుల పాలనలోనే నాలుగు లక్షల ఉద్యోగాలను కల్పించి జగన్ చరిత్ర స ృష్టించినట్లు పేర్కొన్నారు. సీఎం జగన్ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సాహొసోపేత నిర్ణయాలతో ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు పూర్తి స్థాయి రీయింబర్స్‌మెంట్‌ను కల్పిస్తూ ఎంతో మేలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బి. మోహన్‌బాబు, ఎం. కళ్యాణ్, బి. జోగారావు, కె. దీరజ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


## 70శాతం లబ్దిదారులకు బియ్యం పంపిణీ: నాని

**రాజధాని వార్తలు, అమరావతి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన 'నాణ్యమైన బియ్యం పంపిణీ' పథకానికి మంచి స్పందన వస్తుందన్నారు మంత్రి కొడాలి నాని. జిల్లా



వ్యాప్తంగా 8,60,727 మంది తెల్ల రేషన్ కార్డు లబ్దిదారులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రెండు రోజుల్లో 70 శాతానికి పైగా లబ్దిదారులకు గ్రామ వాలంటీర్లు 9,48,105 సంచుల బియ్యం సంచులను పంపిణీ చేశారన్నారు. గత నాలుగైదు రోజులుగా శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నప్పటికి.. ఇబ్బందులను అధిగమించి బియ్య రవాణా చేస్తున్నామన్నారు. వర్షాల కారణంగా 25 బియ్యం సంచులు తడిసిపోయాయని వాటి స్థానంలో కొత్తవాటిని తిరిగి పంపిణీ చేశామని మంత్రి నాని తెలిపారు.

## అమరావతి భూములపై నా సవాల్ : సుజనాచౌదరి



**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై బీజేపీ ఎంపీ సుజనాచౌదరి విమర్శలు గుప్పించారు. జగన్ వంద రోజుల పాలనలో 110 తప్పులు చేశారని సుజనాచౌదరి మండిపడ్డారు. చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు దొందూ దొందే అని, కీలకమైన పోస్టులు ఒకే సామాజిక వర్గానికే ఇస్తున్నారని విమర్శించారు. అమరావతి భూములపై తన సవాల్‌ను స్వీకరించే ధైర్యం వైసీపీకి లేదని సుజనా అన్నారు. అమరావతి, పోలవరం పనులు నిలిపివేయడం, విద్యుత్ ఒప్పందాల రద్దు చేయడం వైసీపీ ప్రభుత్వ విజయమా? అని సుజనా ప్రశ్నించారు. రాష్ట్రంలో వంద రోజులుగా అన్యమత ప్రచారం ఎక్కువైందని, వంద రోజుల్లో చాలా మంది పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లారని సుజనా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ కార్యకర్తలకే వాలంటరీ పోస్టులు, బియ్యం సంచుల కాంట్రాక్ట్ కోసమే నాణ్యమైన బియ్యమంటున్నారని ఎద్దేవా చేశారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు అటకెక్కాయని, కడప స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఎక్కడ నుంచి తెస్తారు? అని సుజనా ప్రశ్నించారు. పథకాల పేర్లు మారిస్తే తప్పులేదని.. నిలిపివేత సరికాదని సుజనాచౌదరి అన్నారు.


## మహిళలకు సముచిత స్థానం కల్పించారు : వాసిరెడ్డి పద్మ



**రాజధాని వార్తలు, కృష్ణా :** జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న ఆశయంతో నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రభుత్వం దశల వారీగా మద్యపాన నిషేధాన్ని విధించి మహిళల జీవితాల్లో ఆనందం నింపిన గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ 100 రోజుల పరిపాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామినేని ప్రశాంత్ బాబు, తన్నీరు నాగేశ్వరావు, జాన్ వెస్లీ, వేల్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మరిన్ని ఇసుక రీచ్‌లు కావాలి

- పక్క జిల్లాల ఇసుకే ఆధారం
- జిల్లాలో గుర్తించని ఇసుక రీచ్‌లు
- ఇప్పటికే భవన నిర్మాణ రంగం కుదేలు
- నెల్లూరు, గుంటూరు నుంచి దిగుమతి



**రాజధాని వార్తలు, ఒంగోలు :** రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక పాలసీ విధానం అమల్లోకి వచ్చింది. గత రెండు నెలల పాటు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసి ఈ నెల 5వ తేదీన క్యాబినేట్ ఆమోదం అనంతరం రాష్ట్రంలో నూతన ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. అయితే ప్రకాశంజిల్లాలో మాత్రం ఒక్క ఇసుక రీచ్‌ను కూడా అధికారులు గుర్తించడంలో ఘోర వైఫల్యం చెందారు. ఫలితంగా జిల్లా వాసులకు ఇసుక కావాలంటే ఆన్‌లైన్‌లో ఇసుక లారీ, లేదా ట్రాక్టర్‌ను యూనిట్‌ల రూపంలో బుక్‌చేసుకొని నెల్లూరు లేదా గుంటూరు జిల్లాల నుండి తరలించుకోవాల్సిందే. ప్రస్తుతానికి జిల్లాలో ఇసుక రీచ్‌లను సకాలంలో అధికారులు గుర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన జిల్లాలో ఇసుక కొరత పట్టి పీడిస్తుంది. ఇప్పటికే గత మూడు నెలల నుండి ఇసుక అందుబాటులో లేకపోవడం భవన నిర్మాణ రంగం కుదేలు అయ్యింది. కూలీలకు పనులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్న పెద్ద చిన్న వ్యాపారస్తుల సైతం అనేక ఒడి దుడుకులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీ అందని ద్రాక్షాలా మారింది. ఇసుక విక్రయాలు ఎంపియండిసి ద్వారా జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అయా శాఖాధికారులు నిమగ్నమయ్యారు. అదే క్రమంలో ఇసుక అక్రమ తరలింపులు జరగకుండా వేబిల్లులు ఇవ్వనున్నారు. నగదులావాదేవీలన్ని బ్యాంకుల ద్వారా జరగనున్నాయి. ఇసుక అవసరమైన వారు డిడిలు తీసి ఎపియండిసి అధికారులకు ఇస్తే వాటిని పరిశీలించి అధికారులు పంపుతారు. ప్రస్తుతం రాష్ట్రంలో టన్ను ఇసుక రూ. 375లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వమే డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి అక్కడి నుండి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి ట్రాక్టర్ల ద్వారా పంపించనుంది. ఇందుకు కూడా రవాణా ఖర్చులు వసూల చేశారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ, 1300 నుండి 1500 వరకు ఉండగా ప్రసుత్తం ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రూ. 1600 నుండి రూ.2 వేల వరకు పలుకుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఏపీ ఎండిసి ఆధ్వర్యంలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లను నుండి ఇసుకను తీసుకువచ్చి స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుకను విక్రయించాలి. అయితే ప్రకాశంజిల్లాలో ప్రస్తుతానికి ఒక్క ఇసుక రీచ్‌ను కూడా అధికారులు ఇప్పటి వరకు గుర్తించలేదు. కారణం మైన్స్, రెవిన్యూ అధికారుల మధ్య సమసన్వయలోపం వలనే ఆలస్యం జరుగుతుందన్న వదంతులు వినిపిస్తున్నాయి. గతంలో ఒంగోలు సమీపంలోని మద్దిపాడు, నాలుగుప్పలపాడు, ఉలవపాడు, జరుగుమల్లి, అద్దంకి, ముండ్ల మూరు తదితర మండలాల్లో 20కి పైగా రీచ్‌లను అధికారులు గుర్తించారు. వాటి ద్వారా జిల్లాలో ఇసుక విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం అధికారులు ఇసుక రీచ్‌లను ఇప్పటి వరకు గుర్తించకపోవడం వలన ప్రస్తుతానికి నెల్లూరు జిల్లా నుండి ఇసుకను తరలించుకొనేందుకు అనుమతులు ఇస్తామని అధికారులు ప్రకటించారు. మరో రెండు, మూడు రోజుల్లో జిల్లాలోని రీచ్‌లను గుర్తిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గత మూడు మాసాలుగా జిల్లాలో ఇసుక కొరత వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భవన నిర్మాణ కార్మికులు కొత్త ఇసుక పాలసీ విధానం వచ్చినా జిల్లాకు ఏమిటీ ఈ శాపమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక పాలసీ విధానంలో అనేక నిబంధనలు తీసుకువచ్చిన అధికారులు ఇసుక అక్రమ తరలింపును అరికట్టేందుకు పోలీస్, రెవిన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు నిరంతరం గస్తీలు నిర్వహించనున్నారు. వే బిల్లులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నారు.


## ట్రీ గార్డులను తస్కరిస్తే చర్యలు

**రాజధాని వార్తలు, గుంటూరు :** నగరంలో పలు ప్రాంతాల్లో మొక్కల పరిరక్షణకు ఏర్పాటు చేసిన ట్రీ గార్డులను కొంతమంది తస్కరించి వారి సొంత ప్రయోజనాలకు వినిమోగించు కుంటున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామని నగర కమిషనర్ శ్రీకేష్ తెలిపారు. ప్రజలు మొక్కల పెంపునకు ట్రీగార్డ్స్ కావాలంటే గాంధీపార్కులో సంప్రదిస్తే ఉచితంగా అందిస్తామన్నారు. నరసరావుపేట రోడ్డు పక్కన శ్రీను అనే చిరు వ్యాపారి ట్రీగార్డ్స్ తొలగించి తన వ్యాపార వాహనానికి రక్షణ వలయంగా ఏర్పాటు చేసికొని ప్రభుత్వ సంపదను దుర్వినియోగం చేశాడని తెలిపారు. దీంతో శ్రీనుపై చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

### గుంటూరులో శాడిస్టు వడ్డీవ్యాపారి.. 'స్పందన' ఫిర్యాదుతో అరెస్ట్ చేసిన పోలీసులు!

**రాజధాని వార్తలు,గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో కాల్ మనీ వడ్డీ వ్యాపారుల వేధింపులు మర్చిపోకముందే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. గుంటూరులోని కొత్తపేటలో వడ్డీ వ్యాపారం ముసుగులో సామాన్యులను వేధించుకు తింటున్న రత్నారెడ్డి అనే వ్యాపారిని ఈరోజు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ సీఎం జగన్ ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఇటీవల 'స్పందన' కార్యక్రమం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా చాలామంది ప్రజలు రత్నారెడ్డి వేధింపులపై పోలీసుల ముందు వాపోయారు. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కొత్తపేట సీఐ సుధాకర్ రెడ్డి.. సుధాకర్ అనే బాధితుడి ఫిర్యాదు ఆధారంగా రత్నారెడ్డిని అరెస్ట్ చేశారు. అనంతరం రత్నారెడ్డి కార్యాలయంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు విస్తుపోయారు. అతని ఆఫీసు నుంచి 225 ఏటీఎం కార్డులు, రూ.1.40 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 35 పాస్ పుస్తకాలు, 102 ఖాళీ ప్రామిసరీ నోట్లు, 293 ఖాళీ చెక్కులు, 8 పట్టాదారు పాస్ పుస్తకాలు, 20 దస్తావేజులు రత్నారెడ్డి ఆఫీసులో లభించాయి.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి ఖరారు!



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డి పేరు ఖరారైంది. ఏపీ ప్రభుత్వం ఇటీవల లోకాయుక్త చట్టాన్ని సవరించిన సంగతి తెలిసిందే. దీనిప్రకారం హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లేదా విశ్రాంత న్యాయమూర్తిని లోకాయుక్తగా నియమించాలని నిబంధనలను సవరించారు. అందులో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డి పేరును ఖరారు చేశారు. కాగా, లక్ష్మణ్ రెడ్డి పేరుకు ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ ఆమోదముద్ర వేశారు.

ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, విచారించే అధికారం లోకాయుక్తకు ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చీఫ్ విప్, ప్రజా వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వం నియమించే ఏ అధికారిపై అయినా లోకాయుక్త విచారణ జరపవచ్చు. అయితే జడ్జీలు, జ్యుడీషియల్ సర్వీసు సభ్యులు మాత్రం దీని పరిధిలోకి రారు. అలాగే రాష్ట్రంలోని ఏదైనా కోర్టు అధికారి, ఉద్యోగి కూడా లోకాయుక్త పరిధిలోకి రారు. వీరితో పాటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ఏపీఏటీ చైర్మన్, ఇతర సభ్యులు, ఏపీ అకౌంటెంట్ జనరల్, ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యులు, ఎన్నికల అధికారులను లోకాయుక్త విచారించలేదు. కాగా, లోకాయుక్తగా లక్ష్మణ్ రెడ్డి నియామకాన్ని ఖరారు చేస్తూ ఏపీ ప్రభుత్వం త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీచేయనుంది.

## 'విక్రమ్'తో కమ్యూనికేషన్ కట్

(మొదటిపేజీ తరువాయి)

### సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ

శనివారం తెల్లవారుజామున 1:38 గంటలకు ల్యాండర్ విక్రమ్ సేఫ్ ల్యాండింగ్ ప్రక్రియ మొదలైంది. ఇందులో భాగంగా రఫ్ బ్రేకింగ్ ప్రారంభమైంది. అంటే కక్ష్య నుంచి చంద్రుడిపై దిగే ప్రక్రియ మొదలైంది. ఆ తర్వాత 1:48 గంటలకు ల్యాండర్ వేగం తగ్గుతూ ఫైన్ బ్రేకింగ్ ప్రారంభమైంది. రెండు నిమిషాల తర్వాత అంటే 1:50 గంటలకు లోకల్ నావిగేషన్ మొదలైంది.అంతా సవ్యంగా సాగితే 1:52 గంటలకు ల్యాండర్ చంద్రుడి తొలి చిత్రాన్ని భూమికి పంపించాల్సి ఉంది. అలాగే, 1:53కి ల్యాండర్ చంద్రుడిపై సురక్షితంగా దిగాలి. కానీ, చివరి నిమిషంలో సంకేతాలు తెగిపోయాయి.ల్యాండర్ దిగాల్సిన చోటు నుంచి 2.1 కిలోమీటర్ల దూరంలో ఉండగా సిగ్నల్స్ కట్ అయ్యాయి. ల్యాండర్ దిశ కొద్దిగా మారినట్లు స్క్రీన్‌పై గుర్తించారు.ఇస్రో శాస్త్రవేత్తల ముఖాల్లో టెన్షన్ స్పష్టంగా కనిపించింది. ఏం జరిగిందో కాసేపు అర్థం కాలేదు. ఆ తర్వాత కాసేపటికి ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోయాయని ఇస్రో చైర్మన్ ప్రకటించారు. డేటాను విశ్లేషిస్తున్నామని వివరించారు.షెడ్యూల్ ప్రకారం 1:53 గంటలకు ల్యాండర్ చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్ కావాల్సి ఉంది. ఆ తర్వాత 3:53 గంటలకు రోవర్ ప్రజ్ఞాన్ ప్రక్రియ ప్రారంభమై, 4: 23 గంటలకు పని ప్రారంభించాల్సి ఉంది. 5:19 గంటలకు ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ బయటకు వచ్చి, 5:29కి చంద్రుడి ఉపరితలంపై దిగాల్సి ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలోని మాంజినస్–సీ, సింపెలియస్–ఎన్ అనే రెండు బిలాల మధ్యన ఉన్న ఎత్తైన ప్రాంతంలో ల్యాండర్ దిగాల్సి ఉంది.చంద్రుడి ఉపరితలంపైన, లోపల ఒక రోజు (ఇది భూమిపై 14 రోజులకు సమానం) పాటు పరిశోధనలు, ప్రయోగాలను నిర్వహించేలా రోవర్‌ను రూపొందించారు.

### 'సైన్స్‌లో వైఫల్యాలు ఉండవు ఇస్రో శాస్త్రవేత్తలతో మోడీ

చంద్రయాన్–2 సాఫ్ట్ లాంచ్‌లో అవాంతరం ఏర్పడిన అనంతరం ఇస్రో నుంచి ప్రధాన మోడీ మాట్లాడారు. చంద్రయాన్ మిషన్ కోసం శాస్త్రవేత్తలు రేయింబవళ్లు శ్రమించారని కొనియాడారు. అయితే ఆఖరి అడుగులో అవరోధం తలెత్తిందన్నారు. అయినా దీనిని 'చంద్రయాన్ చివరి నిమిషంలో చంద్రుడిని ఆలింగనం చేసుకోవటానికి పరుగుతీసింద'ని భావిద్దామన్నారు. శనివారం ఉదయం బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో మోదీ చేసిన ప్రసంగాన్ని మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు.'భారత్ మాతాకీ జై' అని మూడుసార్లు నినాదం చేసి మోడీ ప్రసంగం ప్రారంభిస్తూ.."అతి త్వరలో నూతన ఉదయం ఉంటుంది. రేపు ప్రకాశవంతంగా ఉంటుంది.సైన్స్‌లో వైఫల్యం అనేది లేదు. ప్రయోగాలు, ప్రయత్నాలు మాత్రమే ఉంటాయి. మనం మళ్లీ పైకిలేస్తాం. సరికొత్త శిఖరాలను, విజయాలను అందుకుంటాం.ఈ పాఠాలు మనల్ని మరింత బలోపేతం చేస్తాయి."మన ఘనమైన చరిత్రలో మన వేగాన్ని మందగింపజేసిన క్షణాలను మనం ఎదుర్కొన్నాం. కానీ అవి ఎన్నడూ మన స్ఫూర్తిని అణచివేయలేదు.మనం మళ్లీ పైకి లేచాం. అదుతే విజయాలు సాధిస్తూ ముందుకుసాగాం. మన నాగరికత ఇంత గొప్పగా నిలవటానికి ఇదే కారణం.ఈ ప్రయత్నం, ఈ ప్రయాణం విలువైనవని ఈ రోజు నేను సగర్వంగా చెప్తా. మన టీం కష్టపడి పనిచేసింది. సుదూరం ప్రయాణించింది.ఈ పాఠాలు మనతోనే ఉంటాయి. నేడు నేర్చుకున్నవి మనల్ని మరింత బలోపేతం చేస్తాయి. మరింత ఉత్తమంగా మలచుతాయి.""మన అంతరిక్ష కార్యక్రమం పట్ల మనం గర్విస్తున్నాం. ఇప్పుడు చంద్రుడిని తాకాలన్న మన పట్టుదల మరింత బలపడింది. మీరు ఉదాసీనం కావద్దు. ఇది చిన్న విజయం కాదు. మీ విజయాల పట్ల దేశం గర్విస్తోంది. అయితే గత కొద్ది గంటలుగా దేశమొత్తం ఆందోళనగా ఉంది. మీకు ప్రతి ఒక్కరూ అండగా ఉన్నారు.మనం అధిగమిస్తాం. కొత్త శిఖరాలను, విజయాలను అందుకుంటాం. మన శాస్త్రవేత్త లకు నేను చెప్పదలచుకున్నా.. భారతదేశం యావత్తూ మీతో ఉంది అని భరోసా ఇచ్చారు.

# ఐవీఎఫ్ పద్ధతిలో కవల్లలకు జన్మనిచ్చిన 73 ఏళ్ల బామ్మ



**తూ**ర్పు గోదావరి జిల్లా నెలపర్తిపాడుకు చెందిన యరమాటి సీతారామ రాజారావు, మంగాయమ్మ దంపతులకు 1962 మార్చి 22న వివాహమైంది. పెళ్లయి ఎన్నాళ్లయినా పిల్లలు పుట్టకపోవడంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. వారి ఆశ తీరకుండానే ఇద్దరూ వృద్ధాప్యంలోకి అడుగుపెట్టారు. అయినప్పటికీ మంగాయమ్మకు మాత్రం తల్లి కావాలనే కోరిక బలీయంగా ఉంది. వారికి పొరుగున ఉండే ఒక మహిళ 55 ఏళ్ల వయసులో కృత్రిమ సంతాన సాఫల్య విధానంలో తల్లి కావడంతో, తానూ పిల్లల కోసం ఆ పద్ధతిని ఆశ్రయించాలని మంగాయమ్మ నిర్ణయించుకున్నారు.

ఈనెల 5 గురువారం ఉదయం 10.30 గంటలకు సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ఇద్దరూ ఆడపిల్లలను డాక్టర్లు బయటకు తీశారు. ప్రస్తుతం పిల్లలు, తల్లి క్షేమంగానే ఉన్నారని గుంటూరు నగరంలోని నర్సింగ్ హోమ్ వర్గాలు తెలిపాయి. ఒక్కొక్కరూ 1.8 కిలోల చొప్పున బరువు ఉన్నారని ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ ఉమా శంకర్ బీబీసీతో చెప్పారు. ప్రస్తుతానికి మంగాయమ్మను, పిల్లలను ఆరు గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచామని వెల్లడించారు. ఆ తర్వాత పిల్లలు ఇద్దరూ 21 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంటారని వివరించారు. వయసు పైబడిన మహిళలు పిల్లలకు జన్మనిచ్చినప్పుడు.. సాధారణంగా రొమ్ముపాలు ఇవ్వకుండా చూస్తామని, వేరే తల్లుల పాలు పడతామని ఆయన తెలిపారు. తనను గొడ్రాలు అంటూ చుట్టుపక్కల వాళ్లు నిందించేవాళ్లని, అందుకే పిల్లలకు జన్మనివ్వాలనుకుంటున్నానని మంగాయమ్మ చెబుతూ "ఇది నా జీవితంలో అత్యంత ఆనందకరమైన సమయం. ఎన్నో ప్రయత్నాలు చేశాం, ఎందరో డాక్టర్లను కలిసాం. ఇద్దరు బిడ్డలు కలగడం ఆనందంగా ఉంది. అంతా డాక్టర్ ఉమా శంకర్ గారి చలువ" అంటూ వ్యాఖ్యానించారు.

ఆమె భర్త రాజారావు మాట్లాడుదూ "చాలా సంతోషంగా ఉంది. అంతా డాక్టర్ల కృషి. మొదట్లో మేము కూడా చాలా ప్రయత్నాలు చేసి విసిగిపోయాం. అయినా ఈ డాక్టర్ గురించి విని ఓ ప్రయత్నం చేద్దామని వచ్చాము. రెండు నెలలకే గర్భం రావడంతో నమ్మకం కుదిరింది. గతంలో కొన్నిసార్లు అలానే జరిగి మళ్ళీ పోయేది. అందుకే 9నెలలుగా ఆస్పత్రిలో నే ఉన్నాం. ఈరోజు పిల్లలను చూసిన తర్వాత మా వాళ్ళు అందరూ నన్ను గొడ్రాజు అంటూ వేసిన ముద్ర పోయింది. పిల్లలు ఇద్దరినీ జాగ్రత్తగా చూసుకుంటాం" అంటూ చెప్పుకొచ్చారు.

గతేడాది నవంబరులో గుంటూరులోని ఒక నర్సింగ్ హోమ్‌కు మంగాయమ్మ దంపతులు వచ్చి ఐవీఎఫ్ నిపుణులైన డాక్టర్ ఉమాశంకర్‌ను కలిశారు. బీపీ, షుగర్ లాంటి ఆరోగ్య సమస్యలేవీ లేకపోవడంతో వైద్యులు ఆమెకు సంతాన సాఫల్య చికిత్స ప్రారంభించారు. మంగాయమ్మ మెనోపాజ్ దశ దాటిపోవడంతో వేరే మహిళ నుంచి అండాన్ని.. మంగాయమ్మ భర్త నుంచి వీర్యాన్ని సేకరించి ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతిలో ప్రయత్నం చేశారు. మొదటి సైకిల్‌లోనే వైద్యుల కృషి ఫలించింది. ఈ ఏడాది జనవరిలో మంగాయమ్మ గర్భం ధరించినట్లు తేలింది. అప్పటి నుంచి ఆమెను ఆస్పత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. స్కానింగ్‌లో మంగాయమ్మ గర్భంలో కవలలు ఉన్నట్లు తెలిసింది.

**'ప్రపంచ రికార్డ్': డాక్టర్**

73 ఏళ్ల వయసులో మంగాయమ్మ కవలలకు జన్మనివ్వడం ప్రపంచ రికార్డు అని డాక్టర్ చెప్పారు. 'ప్రస్తుతం గిన్నిస్ బుక్ రికార్డుల ప్రకారం 67 ఏళ్ల వయసులో ఒక మహిళ పిల్లలకు జన్మనిచ్చారు. మంగాయమ్మ 1947 జూలై 1వ తేదీన జన్మించారు. ఇప్పుడు ఆమెకు 73 సంవత్సరాలు. కాబట్టి ఇది ప్రపంచ రికార్డు' అని ఉమా శంకర్ తెలిపారు.

## మైనార్టీ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

**రాజధాని వార్తలు, అమరావతి :** క్రైస్తవ, దూదేకుల సాహెబ్(నూర్‌బాషా) విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ క్రైస్తవ(మైనార్టీల) ఆర్థిక సంస్థ, ఏపీ దూదేకుల(నూర్‌బాషా) ఫెడరేషన్ ఎండీ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 1-10వ తరగతి విద్యార్థులు వచ్చే నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరికి కుటుంబ వార్షికాదాయం పరిమితి రూ.1 లక్ష అని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిపలకు ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ విద్యార్థులు వచ్చే నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీరి కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల్లోపు ఉండాలని పేర్కొన్నారు. అలాగే, ఇంజినీరింగ్, వైద్య, ఇతర వృత్తివిద్య-సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల విద్యార్థులు మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిపకు వచ్చే నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరి కుటుంబ వార్షికాదాయ పరిమితి రూ.2.50 లక్షలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న రాష్ట్ర విద్యార్థులు, మేనేజ్‌మెంట్ కోటాకు చెందిన వారు కూడా దీనికి అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారిని లేదా క్రైస్తవ, దూదేకుల(నూర్‌బాషా) కార్యాలయం (ఫోన్ నెంబర్లు 8897652340, 9581343444)లో సంప్రదించాలని సూచించారు.
www.scholarships.gov.in వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

## పండ్లు పంపిణీ

**రాజధాని వార్తలు, విజయవాడ తూర్పు :** వైద్య రంగానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ



పార్లమెంటరీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. వైఎస్సాన్ 10వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రి లో చికిత్స పొందుతున్న రోగులకు డాక్టర్ మెహబూబ్ షేక్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాంచారయ్య, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, పార్టీ నేతలు ప్రభు పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో యూరియా కొరత లేదు'

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో యూరియా నిల్వలు ఖరీఫ్ సీజన్ అవసరాల మేరకు ఉన్నాయని వ్యవసాయశాఖ పేర్కొంది. వ్యవసాయశాఖ కమిషనర్ అరుణ కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. యూరియా నిల్వలపై ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. యూరియా నిల్వలు మార్క్‌ఫెడ్, డీలర్స్ వద్ద ఉన్నాయని వెల్లడించారు.

# ఆర్టీసీ ప్రభుత్వ పరం!

- సీఎంకు నివేదిక అందజేసిన నిపుణుల కమిటీ
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చేందుకు నిర్ణయం
- కొత్తగా ప్రజా రవాణా శాఖ ఏర్పాటు
- ఉద్యోగ విరమణ వయసు 58 నుంచి 60కి పెంపు
- చార్జీలు ఫెయిర్‌గా ఉండేందుకు రెగ్యులేటరీ కమిషన్
- దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులు


**రాజధాని వార్తలు, అమరావతి :** ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కలను సీఎం వైఎస్ జగన్ నెరవేర్చుతున్నారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వంలోకి తీసుకోవడానికి ఆయన ఆమోదం తెలపడంతో 52 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆంజనేయరెడ్డి నేత ృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ 90 రోజుల పాటు అధ్యయనం చేసిన అనంతరం మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి నివేదిక సమర్పించింది. ఈ నివేదికపై ముఖ్యమంత్రి.. నిపుణుల కమిటీలోని సభ్యులతో పాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పేర్ని నాని, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కొత్తగా ప్రజా రవాణా శాఖ ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులందరూ ఈ శాఖ కిందకు వస్తారు. మరో వైపు ప్రస్తుతం ఉన్న ఉద్యోగ విరమణ వయసును 58 నుంచి 60కి పెంచాలని నిర్ణయించారు. బస్సు చార్జీలు ఫెయిర్‌గా ఉండేలా ట్రాన్స్‌పోర్ట్ రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా సీఎం సూచించారు. దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలని చెప్పారు. ఈ మేరకు నిర్ణయాలను బుధవారం మంత్రివర్గం ఆమోదించనుంది.

**త్వరలో విధివిధానాలు ఖరారు**

ఆర్టీసీ విలీనం వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.3,300 కోట్ల నుంచి రూ.3,500 కోట్ల వరకు భారం పడుతుందని రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. ఈ భారాన్ని భరించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. విధివిధానాలన్నీ త్వరలో ఖరారవుతాయన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక లాభాల బాటలో పరుగెత్తించడమే కాకుండా దేశంలోనే నంబర్ వన్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌గా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మార్గనిర్దేశం చేశారన్నారు. చాలా అంశాలపై అధ్యయనం జరిగాకే ముఖ్యమంత్రి.. ఆర్టీసీ విలీన నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పటి నుంచో అభద్రతా భావంతో ఉన్నారని, ప్రభుత్వ ఉద్యోగులు కావాలన్న వారి కల ఇప్పుడు ముఖ్యమంత్రి నిర్ణయంతో నెరవేరబోతోందని పేర్కొన్నారు. దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెట్టి.. బస్సు అంటే రాష్ట్ర బస్సే ఎక్కాలన్నంతగా ఆధునికీకరించాలని సీఎం చెప్పారన్నారు. బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ విలీనం ఆమోదం పొందుతుందని మంత్రి వెల్లడించారు.

**టీటీడీ పాలక మండలి సభ్యుల సంఖ్య పెంపు**

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల సంఖ్యను పెంచుతూ ఆర్డినెన్స్




జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రి మండలి సమావేశంలో ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలుపనున్నారు. ప్రస్తుతం పాలక మండలి సభ్యుల సంఖ్య 19 ఉండగా, ఇకపై 25కు (ఎక్స్‌అఫీషియో సభ్యులు కాకుండా) పెంచనున్నారు. నూతన ఇసుక విధానానికి, మావోయిస్టు.. దాని అనుబంధ సంస్థలపై నిషేధాన్ని పొడిగిస్తూ జారీ చేసిన జీవోలకు మంత్రివర్గం ఆమోదం తెలుపనుంది.

**కార్మికుల్లో హర్షాతిరేకాలు**

విజయవాడ : తమను ప్రభుత్వోద్యోగులుగా పరిగణించనున్నందుకు ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క ృతజ్ఞతలు తెలిపారు. తమ చిరకాల కోరిక నెరవేర్చిన సీఎంకు రుణ పడి ఉంటామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయు) నాయకులు పలిశెట్టి దామోదరరావు, వైవీరావులు అన్నారు. విలీన కమిటీకి ఆర్టీసీ ఉద్యోగుల సంఘాలు ఇచ్చిన అన్ని డిమాండ్లను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే అన్ని సౌకర్యాలు ఆర్టీసీ ఉద్యోగులకు వర్తించేలా చూడాలన్నారు.

# మాకొద్దీ... ఉద్యోగం

- విముఖత వ్యక్తం చేస్తున్న వలంటీర్లు
- గ్రామ సచివాలయ ఉద్యోగాలపైనే ఆసక్తి
- గ్రామాల్లో సానుకూలం, పట్టణాల్లో ప్రతికూలం

**రాజధాని వార్తలు, గుంటూరు :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ల వ్యవస్థ ఆశించిన స్థాయిలో విజయవంతం కావడంలేదని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టు 15వ తేదీ నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు విధుల్లో చేరారు. గ్రామ,వార్డు వలంటీర్లుగా విధులు స్వీకరించిన వారు విధుల నిర్వహణలో భాగంగా ఇంటింటికీ తిరిగి సర్వే చేయాల్సి ఉంటుంది. ఈ సర్వే కోసం ఇంటింటికీ తిరుగుతున్న వలంటీర్లకు చ్కులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు అధికారులు వలంటీర్లకు చాలా చోట్ల గుర్తింపు కార్డులను ఇవ్వలేదు. గుర్తింపు కార్డులు లేకపోవటంతో సర్వే కోసం వెళ్లిన వారిని గుర్తింపు కార్డు చూపించాలని, గుర్తింపు కార్డు లేకపోతే నువ్వు వలంటీరు అనే నమ్మకం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు గ్రామ, వార్డు వలంటీర్లుగా ఎంపికైన వారు పూర్తి స్థాయిలో విధుల్లో చేరలేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో సర్వే పూర్తి కాకపోవటంతో గడువు పెంచే అవకాశం ఉందని సమిచారం. వలంటీర్లు సర్వేలో భాగంగా వివరాలను సేకరిస్తున్నారు. పేరు, అకౌంట్ నెంబర్, బ్రాంచ్ కోడ్ తదితర వివరాలు సేకరిస్తుండడంతో బయటి వ్యక్తులకు ఈ సమాచారం చేరితే ఇబ్బందులు పడే అవకాశం ఉందని కొందరి భయాందోళనకు గురవుతున్నారని సమాచారం.

సర్వేలో భాగంగా రేషన్ కార్డు నెంబర్, ఇంటి స్థలం, ఇంటికి సంబందించిన వివరాలు, పొలానికి సంబంధించిన వివరాలు, లబ్ధిదారుడి వార్షిక ఆదాయానికి సంబంధించిన వివరాలు, ఇతర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. నగరాల్లో భారీగా వలంటీర్ల కొరత ఉండటం కూడా సర్వే ఆలస్యం కావటానికి కారణంగా తెలుస్తోంది. వలంటీర్ల జీతాల చెల్లింపు కోసం ప్రభుత్వం నిధులను కేటాయించింది. వలంటీర్లు వారి బ్యాంకు ఖాతాకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. అదేదో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగమని చాలామంది భావించగా, అది ఒక్క ఏడాదిలో ముగిసే ఉద్యోగమని తర్వాత తెలియడం, వలంటీర్లు ఇకపై చదువుకోవటానికి వీల్లేదని స్పష్టం కావడంతో వలంటీర్ల వ్యవస్థపై ఉన్న క్రమాలన్నీ కరిగిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఐదు వేల రూపాయల జీతం, 50 ఇళ్లకు సేవలు, వంటి నినాదంతో ప్రారంభించిన గ్రామ వలంటీర్ల వ్యవస్థకు తొలుత మంచి స్పందన లభించింది. దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న నిరుద్యోగులు సైతం దీని కోసం వెనక్కి వచ్చిన పరిస్థితి. తీరా ఉద్యోగంలో చేరాక, ఈ పనులు తాము చేయలేమన్న భావన వారిలో ఏర్పడింది. ఈ వ్యవస్థకు గ్రామాల్లో మంచి స్పందన లభిస్తోంది. కారణం గ్రామాల్లో జనాభా తక్కువగా ఉండటమే. పైగా ప్రజలే వలంటీర్ల ఇళ్లకు వస్తుండటంతో వలంటీర్లకు పెద్దగా సమస్యలు తలెత్తడంలేదు. పట్టణాలు, నగరాల్లో మాత్రం ఇదో శిరోభారంగా మారింది. ఆధార్ కార్డు నెంబరు అడుగుతున్నపుడే సమస్యలు మొదలవుతున్నాయి. గత ఎన్నికల్లో ఆధార్ కార్డును అడ్డుపెట్టుకుని దుర్వినియోగం చేశారన్న ప్రచారం జరగడంతో, ఎవరూ ఆధార్ కార్డులివ్వడం లేదు. పైగా, అపార్టుమెంట్లు ఎక్కువగా ఉండటం, విద్యాధికులు ఎక్కువగా ఉండటంతో వలంటీర్లు వెళ్లే సమయానికి వారు ఉండటం లేదు. తమకు వచ్చే 5000



రూపాయలకు ఇంత కష్టపడటం అవసరమా అన్న అంతర్మథనం వారిలో కనిపిస్తోంది. పైగా వలంటీర్లుగా పనిచేసే వారు ఇకపై చదువుకోకూడదన్న నిబంధన, ఏడాది మాత్రమే కాలపరిమితి అన్న నిబంధన కూడా ఈ వ్యవస్థ నిర్వీర్యం అయ్యేందుకు ఓ కారణమవుతోంది. నిజానికి వలంటీర్లలో 80 శాతం మంది గ్రామ సచివాలయ ఉద్యోగాలపై మోజు పడుతున్నారు. ఎంబీఏ, డిగ్రీ, ఎంఏ చదువుకున్న నిరుద్యోగులు ప్రస్తుతం వలంటీర్లుగా పనిచేస్తున్నారు. తొలుత వలంటీర్లంటే ఆషామాషీగా తిరగడం అని చాలామంది భావించారు. కానీ, పని ఎక్కువగా ఉండటం, ప్రజల నుంచి వివరాలకు సంబంధించి సహాయ నిరాకరణ ఎదురవుతుండటంతో, వలంటీర్ల వ్యవస్థపై నిరాసక్తత మొదలైందని వారి మాటల్లోనే స్పష్టమవుతోంది.

# భారీ చలాన్లా?



**రాజధాని వార్తలు, ముంబై :** ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతన మోటారు వాహన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. పలు రాష్ట్రాల్లో సెప్టెంబర్ 1 నుంచి కొత్త మోటారు వాహన చట్టం అమల్లోకి వచ్చింది. దీంతో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలాన్లు భారీమొత్తంలో పెరిగాయి. ఈ చట్టం అమలులోకి రావడంతో ఢిల్లీ శివారులోని గురుగ్రామ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన పలువురు వాహనదారులకు ఒక్కరోజే ఏకంగా రూ. 59వేల వరకు జరిమానాలు విధించారు. ఈ నేపథ్యంలో బీజేపీ మిత్రపక్షం శివసేన ట్రాఫిక్ జరిమానాలపై ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాఫిక్ ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధించడంలోని ఆంతర్యమేమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఈస్థాయిలో జరిమానాలు విధిస్తే.. సామాన్య ప్రజలు ఎలా భరిస్తారని ప్రశ్నించింది.

కొత్త మోటారు వాహన చట్టానికి తాను వ్యతిరేకం కాదని, కానీ జరిమానాలు సామాన్య ప్రజలు భరించలేనివిధంగా చాలా ఎక్కువగా ఉండటాని తాము వ్యతిరేకిస్తున్నామని శివసేన అధికార పత్రిక సామ్నా తన సంపాదకీయంలో పేర్కొం?ది. 'కొత్త చట్టంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు దాదాపు పదిరెట్లు ఎక్కువగా జరిమానాలు పెంచారు. కొత్త చట్టం ఆహ్వానించదగిందే. కానీ మన దేశంలో నిరుపేదలకు అంత భారీస్థాయి జరిమానాలు భరించే స్తోమత ఉందా?' అని సామ్నా పేర్కొంది. నితిన్ గడ్కరీ ప్రవేశపెట్టిన ఈ చట్టంలో పెద్దమొత్తంలో జరిమానాలు ప్రతిపాదించడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయని తెలిపింది.

ఇప్పటికైనా కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ భారీగా పెంచిన జరిమానాలపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేసింది. రోడ్ల మీద అనేక గుంతలు ఉన్నాయని, ఆ గుంతల వల్ల ప్రమాదాలు జరుతున్నాయని, ఈ గుంతలు సరిచేసి.. రహదారులను చక్కగా తీర్చిదిద్దిన అనంతరం కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తే బాగుండేదని సామ్నా అభిప్రాయపడింది. రోడ్లను సరిచేసేవరకు కొత్త చట్టం అమలును నిలిపేయాలన్న గోవా కాంగ్రెస్ డిమాండ్‌ను ఈ సందర్భంగా 'సామ్నా' తన సంపాదకీయంలో ప్రస్తావించింది.

# దసరా సెలవుల్లో.. రైళ్లు.. ఫుల్!

**రాజధాని వార్తలు, గుంటూరు :** మరో మూడు వారాల్లో దసరా నవరాత్రుల సెలవుదినాలు ప్రారంభం కానుండటంతో రైళ్లలో రద్దీ అప్పుడే మొదలైంది. ముఖ్యంగా సెలవులు అయిపోయి తిరిగి వెళ్లే రోజులైన అక్టోబరు 8, 9 తేదీల్లో టిక్కెట్‌లన్ని బుకింగ్ అయిపోయాయి. కొన్ని రైళ్లలో అయితే వెయిలింగ్ లిస్టు 100కి పైగా ఉందంటే చాలామంది అడ్వాన్స్ బుకింగ్ చేసేసుకొన్నారు. పండగకి సెలవులు దొరకుతాయో, లేదోనన్న మీమాంసలో ఉన్నవారు మాత్రం తత్కాల్ కోటా టిక్కెట్‌లు, ప్రత్యేక రైళ్ల పైనే ఎక్కువగా ఆశలు పెట్టుకొంటున్నారు. ఇప్పటికే గుంటూరు రైల్వే డివిజన్ మీదగా పలు ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో రద్దీ మరింత అధికంగా ఉంటే జనసాదారణ రైళ్లని నడపాల్సిందిగా



దక్షిణ మధ్య రైల్వేని కోరే ఆలోచనలో అధికారవర్గాలు ఉన్నాయి.

ఈ నెల 29వ తేదీ నుంచే దసరా నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఆలోపే పాఠశాలల్లో పిల్లలకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించి సెలవులు ఇచ్చే యోచనలో ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యాలు ఉన్నాయి. దసరాని తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిర్వహిస్తారు. దాంతో పండగని స్వస్థలాల్లో ఘనంగా జరుపుకొనేందుకు ఇతర జిల్లాలు, రాష్ట్రల నుంచి వచ్చి వెళ్లడం సాధారణంగానే జరుగుతుంటుంది. రోడ్డు రవాణ కంటే రైలు ప్రయాణం సురక్షితం కావడంతో తొలి ప్రాధాన్యం ఎక్కువగా దీనికే ఇస్తారు. అందులోనూ రెగ్యులర్ రైళ్లలో టిక్కెట్‌లు దొరికితే చాలని భావిస్తారు. చాలామంది ముందుచూపుతో వ్యవహరించి రెండు, మూడు నెలలు ముందుగానే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్నారు. ఈ కారణంగానే అక్టోబరు 8, 9 తేదీల్లో పల్నాడు ఎక్స్‌ప్రెస్ వంటి రైలులో సెకండ్ సిట్టింగ్ టిక్కెట్లకు కూడా వెయిటింగ్ లిస్టు కొనసాగుతోంది.

## కరెంటు లేక రైస్ మిల్లుల మూత

**రాజధాని వార్తలు, పరుచూరు :** గత 5 సంవత్సరాలుగా కరెంటు సరిగ్గా లేక పోవడంతో రైసు మిల్లుల యజమానులు భాధపడుతున్నారు. కేవలం 9గంటలు మాత్రమే కరెంటు ఇవ్వడంతో రైసు మిల్లులను పూర్తిగా వినియోగిం చలేకపోయా రు. ఒక వీర్లపాలెంలోనే 3 రైసు మిల్లులు మూతపడ్డాయి. వాటిని గోడౌన్‌లుగా మార్చారు. పరుచూరు మండలంలో దాదాపు 15 రైసు మిల్లులు మూతపడ్డాయని స్థానిక రైతు తెలిపారు. వాటిని గోడౌన్స్‌గా మార్చారు. కొన్నిచోట్ల కాటన్స్ మిల్స్ కూడా మూతపడ్డాయి. మిషీనరీని అమ్ముకున్న స్థానిక రైతులు.



బీజేపీలో చేరిన గాదె నాగేశ్వరరావు. ఇటీవల జరిగిన ఎన్నికలలో చిలకలూరిపేట నియోజకవర్గ నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి, ఆయన ఓడిపోయారు.

# లక్ష ఉద్యోగాలు ఉఫ్...



- మూడున్నరకోట్ల మంది భవిష్యత్ ప్రశ్నార్థకం
- ఆటోమొబైల్ సంక్షోభం



"తినడానికి తిండి లేదు.. పిల్లలను బడి మాన్పించాల్సి వచ్చింది.. పరిస్థితి ఎలా ఉందో తెలియాలంటే ఫ్యాక్టరీలకు వెళ్లి చూడండి" అని జార్ఖండ్‌లోని ఒక ఇల్లాలు చెప్పింది.

అక్కడో గుడిసెలో యువజంట బియ్యం వారాంతం వరకు సరిపోతాయా, సరిపోవా అని మాట్లాడుకొంటోంది. ఇంతలో ఇల్లాలు తొంగి చూసి,రోజు గడవడానికి అష్టకష్టాలు పడుతున్నామని ఆమె భర్త రామ్ మార్ది వాపోయారు. కుటుంబాన్ని పోషించేది ఆయనే."ఆర్థిక వ్యవస్థ మందగించే వరకు మా జీవితం బాగుండేది. ఇప్పుడు తినడానికి కూడా కష్టంగా ఉంది. పిల్లలను బడి మాన్పించాల్సి వచ్చింది. మా అమ్మ మంచాన పడ్డారు. ఎప్పుడైనా నా ఆరోగ్యం కూడా సరిగా లేకపోతే, మా కుటుంబం ఎలా బతకాలి" అని రామ్ ఆందోళన వ్యక్తంచేశారు.ఆయన పారిశ్రామిక నగరం జంషెడ్‌పూర్‌లో కార్లు, భారీ వాహనాల విడిభాగాల తయారీ సంస్థలో పనిచేస్తున్నారు.గత నెల రోజుల్లో కేవలం రెండు వారాలే ఆయనకు పని దొరికింది. తాము ఉత్పత్తి చేసేవాటికి డిమాండ్ తగ్గడంతో కంపెనీ కొన్ని వారాలకోసారి కార్యకలాపాలు నిలిపివేస్తోంది. దేశంలో వాహనాలకు వినియోగదారుల నుంచి డిమాండ్ బాగా తగ్గిపోయింది. ఇది ఆర్థిక మందగమనాన్ని సూచిస్తోంది. అత్యంత తీవ్రమైన ప్రభావం పడిన పరిశ్రమల్లో కార్ల తయారీ పరిశ్రమ ఒకటి. అనేక కంపెనీలు ఉద్యోగాల్లో కోత పెట్టి, ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నాయి.ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు జులైలో 30 శాతానికి పైగా క్షీణించాయి. ఇవి దాదాపు రెండు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి.బ్యాంకింగ్ సంక్షోభం వల్ల వాహన రంగంలోని డీలర్లు, వాహనాలు కొనాలనుకొనేవారు రుణాల కోసం తిప్పలు పడుతున్నారు.వాహనాలు తయారుచేసే భారీ కంపెనీలకు చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు అవసరమైన పరికరాలను సరఫరా చేస్తాయి. ఆర్థిక మందగమనంతో ఈ పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయి.దాదాపు రెండు దశాబ్దాల క్రితం తన తండ్రి అనారోగ్యం బారిన పడటం, కుటుంబానికి చెందిన వాహన విడిభాగాల తయారీ కర్మాగారం ఇబ్బందుల్లో


ఉండటంతో వృత్తిరీత్యా ఇంజినీర్ అయిన సమీర్ సింగ్ సొంతూరైన జంషెడ్‌పూర్‌కు తిరిగి వచ్చారు.గత రెండు దశాబ్దాల్లో తమ వ్యాపారాన్ని పుంజుకొనేలా చేయడమే కాకుండా, మరిన్ని తయారీ కేంద్రాలను ప్రారంభించారు. ఇవి భారీ వాహనాలకు అవసరమైన విడిభాగాలను తయారుచేస్తాయి.

తమ కర్మాగారాల్లో కార్యకలాపాలు సాగించడానికి తమకు ఎన్నడూ పెద్దగా ఇబ్బంది ఎదురుకాలేదని సమీర్ సింగ్ చెప్పారు.వ్యాపారాన్ని నడిపించడానికి డబ్బు, దృఢమైన సంకల్పం ఉండాలని ఆయన అన్నారు.'నాలాంటి చిన్న వ్యాపారవేత్తలు ఉన్న డబ్బు, దాచుకొన్న డబ్బు, రుణాలు అన్నీ వ్యాపారానికే కేటాయిస్తారు. మేం రుణాలు ఎగవేయాలని అనుకోం. మా ఉద్యోగులు కొన్ని వారాలుగా ఖాళీగా ఉండాల్సి వస్తోంది. వారి పరిస్థితి చూస్తే నాకు బాధగా ఉంది. మా వ్యాపారం ఇలాగే ఇబ్బందుల్లో ఉంటే వాళ్లు ఇక్కడ ఉద్యోగం మానేసి మరో చోట చేరొచ్చు. కానీ నేను మరో చోట ఉద్యోగం వెతుక్కోలేను. నా జీవితం మా వ్యాపారంతోనే ముడిపడి ఉంది" అని సమీర్ సింగ్ విచారం వ్యక్తంచేశారు.దేశంలో ఆటోమొబైల్ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడున్నర కోట్ల మందికి ఉపాధి కల్పిస్తుంది. దీనిని బట్టి ఇప్పుడు ఈ పరిశ్రమలో నెలకొన్న పరిస్థితి ఎంత తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోందో అర్థం చేసుకోవచ్చు.ఇప్పటివరకు లక్ష మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయినట్లు భావిస్తున్నారు.ఆర్థిక మందగమనంతో ప్రజలు పడుతున్న కష్టాలకు పారిశ్రామిక నగరమైన జంషెడ్‌పూర్ లోని పరిస్థితి అద్దం పడుతుంది.వాహనాల విడిభాగాలు తయారుచేసే అనుబంధ కర్మాగారాల్లో అత్యధికం ఆదిత్యపూర్ పారిశ్రామిక ప్రాంతంలోని ఇమ్లి చౌక్‌లో ఉంటాయి. ఈ కర్మాగారాల్లో పని చేసేందుకు నిత్యం ఉదయాన్నే వందల మంది కూలీలు ఇక్కడ పోగవుతుంటారు. వీరిని స్థానిక కాంట్రాక్టర్లు ఫ్యాక్టరీల్లో పనిలో పెడుతుంటారు.కానీ మేం వెళ్లినప్పుడు ఇమ్లి చౌక్‌లో అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. అన్ని వయసుల మగవారు, ఆడవారు పని కోసం అక్కడ ఎదురుచూస్తూ కనిపించారు. వాళ్లలో ఓపిక నశించినట్లు కూడా అనిపించింది. కొందరు కూలీలు మమ్మల్ని కాంట్రాక్టర్లు అనుకొన్నారు.ముగ్గురు పిల్లల తల్లి అయిన లక్ష్మి, రోజూ పని కోసం 15 కిలోమీటర్ల దూరం నుంచి ఇమ్లి చౌక్‌కు వస్తారు. గత కొన్ని నెలలుగా పని సరిగా దొరక్క ఆమెకు నిరాశ ఎదురవుతోంది.రోజు రోజుకూ పరిస్థితి మరింత కష్టంగా మారుతోందని లక్ష్మి ఆందోళన వ్యక్తంచేశారు."కొందరు అదృష్టవంతులకే పని దొరుకుతోంది. చాలా మంది ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. బస్ టికెట్‌కు సరిపడ డబ్బులు కూడా ఉండటం లేదు. చాలాసార్లు మేం ఇంటికి చేరుకొనేందుకు గంటల కొద్దీ నడవాల్సి వస్తోంది. పని దొరికినప్పుడు రోజుకు నాలుగైదు వందల రూపాయలు సంపాదించుకొనేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. రోజుకు వంద నుంచి నూట యాభై రూపాయలు ఇచ్చినా మరుగుదొడ్లు, రోడ్ల శుభ్రం చేయడం సహా ఏ పనైనా చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అయినా మాకు ఏ పనీ దొరకడం లేదు" అని ఆమె తన బాధను పంచుకొన్నారు.వివిధ రంగాల్లో మరిన్ని ఉద్యోగాలకు కోత పడుతుందనే ఆందోళనలు ఉన్నాయి. పర్యవసానంగా ఆర్థిక వ్యవస్థ మొత్తం నెమ్మదిస్తుంది. ఈ ప్రభావం వాహన పరిశ్రమపై పడుతుంది. ఇది పరిశ్రమకు మరింత ఆందోళన కలిగించే అంశం.వాహన అమ్మకాల్లో ఈ ఏడాది నమోదైన క్షీణత ఎంత తీవ్రంగా ఉందంటే- ద్విచక్ర వాహనాలు, కార్లు, కమర్షియల్ వాహనాలు ఇలా ప్రతీ శ్రేణిపై ప్రభావం పడిందని వాహన విడిభాగాల తయారీదారు, భారత ఆటోమోటివ్ విడిభాగాల తయారీదారుల సంఘం (ఏసీఎంఏ) ప్రధాన కార్యదర్శి అయిన సంజయ్ సభర్వాల్ చెప్పారు.గతంలో ఆర్థిక తిరోగమనం లేదా మాంద్యం ఉన్నప్పుడు కమర్షియల్ వాహనాలు, క్రేన్లు, బుల్డోజర్లు లాంటి వాహనాలపైనే ఎక్కువ ప్రభావం ఉండేదని ఆయన ప్రస్తావించారు. కానీ ఈసారి ఒక్కసారిగా అమ్మకాల్లో పతనం నమోదైందన్నారు.జంషెడ్‌పూర్ కర్మాగారాలపై వేల మంది బతుకుదెరువు ఆధారపడి ఉంది. కానీ రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దిగజారే ఆస్కారం ఉంది.విడిభాగాల తయారీదారు రూపేశ్ కర్తియార్‌కు ఉన్న రెండు కర్మాగారాలు గత నెల రోజుల్లో ఒక్క వారంపాటే పనిచేశాయి. ఇదే పరిస్థితిలో చాలా మంది తయారీదారులు ఉన్నారు.మార్కెట్ ఒక్కసారిగా పతనమైందని, ఇది చాలా ఆందోళన కలిగిస్తోందని రూపేశ్ తెలిపారు.అనుకున్నదాని కన్నా వృద్ధిరేటు తక్కువగా ఉండటం వల్ల భారీ కమర్షియల్ వాహనాల అమ్మకాలు పడిపోయాయని, ఇది తాను అర్థం చేసుకోగలనని, కానీ బైక్‌ల వంటి తక్కువ ధర ఉండే ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు కూడా పడిపోయాయని ప్రస్తావించారు. మార్కెట్లో నెగటివ్ సెంటిమెంట్ ఉందని, పరిస్థితి మెరుగుపడటానికి సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు.వాహన పరిశ్రమను ఆదుకొనేందుకు పన్నులు తగ్గించాలని, డీలర్లకు, వినియోగదారులకు రుణ సదుపాయాలను మెరుగుపరచాలని వాహన తయారీదారులు చాలాకాలంగా కోరుతున్నారు. ఎలక్ట్రానిక్ వాహనాల వైపు మళ్లే విషయంలో ప్రభుత్వం వేగం తగ్గించుకోవాలని కూడా చాలా మంది సూచిస్తున్నారు.

దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతుండటాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆర్థిక వృద్ధి రేటును పెంచేందుకు ప్రభుత్వం ఇటీవల అనేక చర్యలు ప్రకటించింది. వాహన రంగాన్ని ఆదుకొనేందుకు ప్యాకేజీ ప్రకటన, ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70 వేల కోట్ల మూలధనాన్ని సమకూర్చడం, గృహ, వాహన రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు దిశగా చర్యలు ఈ జాబితాలో ఉన్నాయి.పరిస్థితిని చక్కదిద్దడానికి ఈ చర్యలు సరిపోతాయా అనే ప్రశ్నకు సమాధానం కష్టమే. దేశ ఆర్థిక వ్యవస్థ తీరును అంచనా వేసేందుకు వాహన పరిశ్రమ వృద్ధిని ఒక సంకేతంగా భావిస్తుంటారు.భారత వాహన రంగంలో ఇదే అత్యంత తీవ్రమైన పతనమని నిపుణులు చెబుతున్న నేపథ్యంలో, ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపైనా తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**- ఖాన్**

## దసరా ఉత్సవాలకు దుర్గగుడి రెడీ



**రాజధాని వార్తలు, విజయవాడ :** అక్టోబర్ 8 మంగళవారం నాడు దసరా పండుగ జరుపుకోబోతున్నాం. ఈ ఏడాది ఏపీలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో... ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్ల విషయంలో అధికారులు ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బెజవాడ కనక దుర్గమ్మ సన్నిధిలో ఈ ఏడాది దసరా ఉత్సవాలు... సెప్టెంబర్ 29న మొదలై... అక్టోబర్ 8న దసరా పండుగ రోజు వరకూ జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు చెయ్యాలనే అంశంపై అధికారులతో దుర్గ గుడి ఈవో సురేష్ బాబు చర్చించారు. ప్రతీ సంవత్సరంలాగానే... క్యూ లైన్లు రథం సెంటర్ దగ్గరున్న వినాయక స్వామి గుడి నుంచీ ప్రారంభం కానున్నాయి.

## ఏపీ భవన్ ప్రత్యేక కమిషనర్‌గా ఎన్వీ రమణారెడ్డి..

బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రత్యేక కమిషనర్, ఎక్స్ అఫిషియో కమిషనర్‌గా నియమితులైన ఎన్‌వి రమణారెడ్డి ఆంధ్రప్రదేశ్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ భవన్ అసిస్టెంట్ కమిషనర్లు, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛా లతో ఆయనకు స్వాగతం పలికారు.



ఐఆర్‌పీఎస్ (1986) బ్యాచ్ అధికారి అయిన రమణారెడ్డి ఇండియన్ రైల్వే లోను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రోటోకాల్ విభాగం సెక్రటరీగా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం మాతృ సంస్థ అయిన ఇండియన్ రైల్వేలోని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ విభాగంలో పనిచేస్తూ తిరిగి డిప్యుటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌కి వచ్చిన రమణారెడ్డిని న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రత్యేక కమిషనర్, ఎక్స్ అఫీషియో కమిషనర్, టూరిజం శాఖ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే.








ఏపీ డీజీపీ శ్రీ గౌతమ్ సావాంగ్ గారిని మర్యాద పూర్వక కలుసుకొన్న ఏపీ ఎన్ఆర్‌టి అధ్యక్షుడు శ్రీవెంకట్ మేడపాటి గారు ఏపీ ఎన్ఆర్‌టి సెల్ ద్వారా ఎన్ఆర్ఐలకు కొనసాగుతున్న సేవల గురించి చర్చించారు. డిజిపి గౌతమ్ గారు ఎపి పోలీస్ డిపార్ట్మెంట్ నుండి ఎల్లప్పుడూ మద్దతు వుంటుందని వారు హామీ ఇచ్చారు.


RAJADHANI GUIDE AMARAVATI
*From Rajadhani Vartalu*
9440662699

రాజధాని క్లాసిఫైడ్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

సాగర్ బోర్ వెల్స్
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీచ్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683,

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కినిక్, డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హాస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద, పాత మంగళగిరి,
9848111905

ప్రకటనలకు సంప్రదించండి 9440662699

రాజధాని వార్తలు దినపత్రికకు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మండల రిపోర్టల్లు కావలేను, సంప్రదించండి ఫోన్ : 9440662699, 7680994755


## జాతీయ మీడియా ఎడ్వవైజర్‌గా : అమర్

**రాజధాని వార్తలు, :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నాకు ఈ అవకాశం ఇవ్వడం ఎంతో సంతోషం. నలభైమూడు సంవత్సరాలు జర్నలిస్టుగా పనిచేశాను. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుగా నా ప్రస్థానం మొదలైంది. ఐజెయు గంటలూ మీడియా వ్యవహారాలకు నేను అందుబాటులో ఉంటాను. వ్యక్తిగతంగా నేను అందరు మీడియా మిత్రులను కలుస్తాను. ఆంధ్రప్రదేశ్ యువ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తున్న అన్ని కార్యక్రమాలు ప్రజలకు చేరేలా



అధ్యక్ష పదవికి రాజీనామా చేశాను. 2014 డిసెంబరు 1 నుంచి 4 th ఎస్టేట్ ద్వారా చాలా ప్రాముఖ్యత సంపాదించాను. నాకు అప్పగించిన బాధ్యత గురుతరమైనది, శుభమైనది కాదు. ఇరవైనాలుగు చేస్తాను. మీడియాలో కావలసిన అన్ని మార్పులు వచ్చేలా చేస్తాను. జర్నలిస్టుల సమస్యలు నేను ముందుగా పట్టించుకుంటానని దేవులపల్లి అమర్ తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com